# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 108 | ఆదివారం 21, డిసెంబర్ 2025 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com




## తెలంగాణలో ఒంటరిగానే
# పోటీ చేస్తాం

**ఎవ్వరితోనూ పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం లేదు**

**తెలివితక్కువ వాళ్లే పొత్తులపై మాట్లాడతారు**

**బీజేపీ పొత్తుల గురించి రేవంత్ రెడ్డి మాట్లాడటం ఏమిటి?**

**ముందు ఆయన సమస్యల మీద దృష్టి పెట్టాలి**

**హామీల అమలు గురించి ఆలోచించాలి**

**రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలకు కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి శనివారం గట్టి కౌంటర్ ఇచ్చారు. బీజేపీకి బీఆర్ఎస్‌తో పొత్తు ఉందని చెప్పేవారు "పసలేని, తెలివి తక్కువవాళ్లు" అంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు."బీజేపీకి ఎవరితోనూ పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం లేదు. మేం స్వతంత్రంగానే బలపడుతున్నాం" అని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ మాజీ సీఎం ..మిగతా 2లో



## వాళ్లు ఏమ్మన్న
# తలదించుకుని వెళ్లండి..

**పంచాయతీ ఎన్నికల విషయంలో ప్రభుత్వం మాట మార్చింది..**

**గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కేసీఆర్ కాలు బయట పెట్టలేదు..**

**తెలంగాణలో అద్భుతంగా బీఆర్ఎస్ నేతలు సర్పంచులుగా గెలిచారు..**

**రెండేళ్లు బీఆర్ఎస్ కు పరీక్ష కాలం.. ఏమ్మన్న తలదించుకుని వెళ్లండి**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ భవన్ లో తాండూరు నియోజకవర్గం నూతన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ వారిని సన్మానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎక్కడ ఉంటే అక్కడ ప్రోగ్రెస్ ఉండదు.. రెండేళ్లు మనకు కష్టాలు తప్పవు అని సెటైర్లు వేశారు. సర్పంచ్ ఎన్నికల ఫలితాలు చూసి ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పెడతారని అనుకోవడం లేదు.. పంచాయతీ ఎన్నికల ఫలితాల విషయంలో రేవంత్ రెడ్డి మీడియా ..మిగతా 2లో



# గులాబీ బాస్ పునరాగమనం

**చాలా రోజుల అనంతరం కేసీఆర్ యాక్టివ్**

**నేడు బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశం**

**నదీ జలాల వాటాలపై పార్టీ నేతలతో చర్చలు**

**ప్రజా ఉద్యమాలు నిర్మించబోతున్న బీఆర్ఎస్**

**పార్టీని బలోపేతం చేసేలా చర్యలు**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ (భారత్ రాష్ట్ర సమితి) ఓటమి తర్వాత మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) తన ఎర్రవల్లి ఫాంహౌస్ కే పరిమితమయ్యారు. గత రెండేళ్లలో పార్టీ సమావేశాలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన చర్చలు కూడా అక్కడి నుంచే నిర్వహించారు. ప్రజల ముందు కేసీఆర్ కనిపించడం చాలా అరుదైంది. అయితే ఇప్పుడు తెలంగాణ సాగునీటి హక్కుల రక్షణ కోసం కేసీఆర్ మళ్లీ ..మిగతా 3లో

## రెబల్స్ ను ఎందుకు
# కంట్రోల్ చేయలే..?



**పంచాయతీ ఎన్నికల నిర్వహణపై టెలీ కాన్ఫరెన్స్**

**రెబల్స్ బెడదను ఎందుకు అరికట్ట లేకపోయారు?**

**బంధువులను ఎన్నికల బరిలో ఎందుకు దించారు?**

**16 మంది ఎమ్మెల్యేలు బాగా పనిచేయలేదు**

**తమ తమ నియోజకవర్గాల్లో ప్రతిపక్షాలకు అవకాశం ఇచ్చారు**

**కొందరు ఎమ్మెల్యేల తీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణలో ఇటీవల ముగిసిన గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ అధిష్ఠానం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. 2025 డిసెంబర్‌లో మూడు దశలుగా జరిగిన ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు గల అభ్యర్థులు సుమారు 7,527 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవులు గెలుచుకున్నారు. రెబల్స్ (పార్టీ అధికారిక అభ్యర్థులకు వ్యతిరేకంగా పోటీ చేసినవారు) 808 పంచాయతీల్లో గెలిచారు. మొత్తంగా కాంగ్రెస్ ప్రభావం ఉన్న పంచాయతీలు 8,335కు చేరాయి - ఇది మొత్తం 12,702 పంచాయతీల్లో సుమారు 66 శాతం. బీఆర్ఎస్‌బీజేపీ కలిపి 33 శాతం, ..మిగతా 2లో

## పది రోజుల్లో అక్రిడిటేషన్ కార్డుల జీవో

వచ్చే ఏడాది ఇళ్ల స్థలాల కేటాయింపు పై తీపి కబురు

టీడబ్ల్యూజేఎఫ్ మహాసభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటన




## రెండేళ్ల తర్వాత జిల్లా
# మంత్రిని నేనే

**జిల్లా ఎస్పీ జాగ్రత్త**

**మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు వార్నింగ్**

**అందోలులో సర్పంచ్, వార్డు సభ్యుల అభినందన సభ**




## కాంగ్రెస్..
# అవినీతి విషవృక్షం

**తెలంగాణలోనూ కూకటివేళ్లతో పెకిలించేస్తాం**

**చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడు**

**వైజాగ్ కు వస్తే బీపీ, షుగర్ ఎగిరిపోతాయ్**

**కేంద్ర మంత్రి బండి సంజయ్**




# జాతిపితను అవమానిస్తారా?

**ఉపాధి హామీ పేరు మార్పుపై పీసీసీ నిరసన**

**కేంద్రం నిర్ణయాన్ని తప్పు పట్టిన కాంగ్రెస్ నేతలు**

**సికింద్రాబాద్ లో పీసీసీ ఆధ్వర్యంలో ఆందోళన**

**కొత్త చట్టంతో రాష్ట్రాలపై భారం పడుతుంది : కాంగ్రెస్**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) పేరును మార్చి, దాన్ని 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్)'గా మార్చాలనే నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ తెలంగాణ కాంగ్రెస్ నేతలు నిరసన కార్యక్రమం చేపట్టారు.

సికింద్రాబాద్ ప్యారడైజ్ ఎంజీ రోడ్‌లో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆధ్వర్యంలో ..మిగతా 2లో

# టీ20 ప్రపంచకప్ కోసం భారత జట్టు ప్రకటన...

టీ20 ప్రపంచకప్, న్యూజిలాండ్ సిరీస్‌కు భారత జట్టు ప్రకటన

కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్, వైస్ కెప్టెన్‌గా అక్షర్ పటేల్

జట్టులోకి ఇషాన్ కిషన్, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్

వికెట్ కీపర్ జితేశ్ శర్మకు కూడా దక్కని చోటు




# ప్రభుత్వం స్పందించకపోతే నిరాహార దీక్ష చేస్తా

**డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించాలి**

**ఒంటరి మహిళలకు, వితంతు మహిళలకు పెన్షన్లలో ప్రాధాన్యత ఇవ్వాలి**

**ప్రభుత్వానికి ముందుగా లేఖలు రాసి నెల సమయం ఇస్తాం**

**స్పందించకపోతే నేను పోరాటం చేస్తా**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు, మానసిక ఎదుగుదల తక్కువగా ఉన్నవారికి పెన్షన్ తో పాటు ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యత ఇచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తెలంగాణ జాగృతి ..మిగతా 2లో





## వాళ్లు ఏమ్మన్న తలదించుకుని వెళ్లండి..

**మొదటిపేజీ తరువాయి**


సమావేశంలో ఐదు నిమిషాలకే మాట మార్చారు అని పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కేసీఆర్ కాలు బయట పెట్టక పోయినా గులాబీ సైనికులు అద్భుతంగా పోరాడారు, ప్రభుత్వం భయపడే పరిస్థితి వచ్చింది అని కేటీఆర్ అన్నారు.
అయితే, కారు గుర్తు ఉండి, కేసీఆర్ గుర్తుకు వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి అని కేటీఆర్ తెలిపారు. రెండేళ్లు బీఆర్ఎస్ కు పరీక్ష కాలం.. కాంగ్రెస్ వాళ్లు ఏమైనా అంటే తలదించుకుని వెళ్లండి, రెండు అడుగులు వెనక్కు వెళ్లండి అని సూచించారు. పంచాయతీలకు డబ్బులు కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా వస్తాయి, ఎవరి ప్రమేయం ఉండదన్నారు. బీఆర్ఎస్ సర్పంచులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వమని ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే అంటున్నారు.. ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు ఇలా అన్నింటి జాబితా పంచాయతీల్లో పెట్టాల్సిందే.. సర్పంచులు, పంచాయతీల చేతిలోనే ఉంటుంది.. నిధులు రావడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెప్తున్నారు.. కాంగ్రెస్ చేతిలో మోసపోని వారంటూ ఎవరూ లేరు, అందరూ బాధపడుతున్నారు.. జనవరి, ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు వస్తాయని అంటున్నారు.. ఇప్పటి నుంచే సిద్ధం కావాలి.. గ్రామీణ ప్రాంతాల వారికి మున్సిపల్ ఎన్నికల బాధ్యతలు అప్పగించండి అని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు.

## కాంగ్రెస్.. అవినీతి విషవృక్షం

- **తెలంగాణలోనూ కూకటివేళ్లతో పెకిలించేస్తాం**
- **చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడు**
- **వైజాగ్ కు వస్తే బీపీ, షుగర్ ఎగిరిపోతాయ్**
- **కేంద్ర మంత్రి బండి సంజయ్**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

అవినీతి కాంగ్రెస్ అనే విష వృక్షాన్ని ఈ దేశం నుంచి పూర్తిగా పెకలించి వేస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అన్నారు. తెలంగాణలో అవినీతి, అక్రమాలతో నిండి పోయిన కాంగ్రెస్ సర్కార్ ను కూకటి వేళ్లతో పెకిలించి వేసి డబుల్ ఇంజిన్ సర్కార్ ను ఏర్పాటు చేసేదాకా విశ్రమించేది లేదని చెప్పారు. అవినీతి కాంగ్రెస్ ను సముద్రంలో విసిరేసిన ఏపీ ప్రజలకు హ్యాట్సాఫ్ అని తెలిపారు. అటల్ మోడీ సుపరిపాలన యాత్రలో భాగంగా శనివారం విశాఖపట్నం పార్క్ హోటల్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్ పేయి కాంస్య విగ్రహాన్ని బండి సంజయ్ ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో బండి సంజయ్ మాట్లాడుతూ.. డబుల్ ఇంజిన్ సర్కార్ తో ఏపీకి కలిగే ప్రయోజనాలను కళ్లారా చూస్తున్నామని, ఏపీ అభివృద్ధిని చూశాక తెలంగాణ ప్రజల్లో ఆలోచన మొదలైందని చెప్పారు. తెలంగాణలోనూ బీజేపీ వైపు ప్రజలు చూస్తున్నారని వ్యాఖ్యానించారు. మోడీ ప్రధాని కావాలని తపించిన ఏపీ సీఎం చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడుని కొనియాడారు. రాబోయే రోజుల్లో ఏపీ, తెలంగాణ అభివృద్ధికి మోదీ సర్కార్ సంపూర్ణహకారం అందిస్తుందని తెలిపారు. విశాఖ ఎదిగితే ఉత్తరాంధ్ర మాత్రమే కాదని, దేశమంతా ఎదుగుతుందన్నారు. వైజాగ్ కు వస్తే బీపీ, షుగర్ ఎగిరిపోతాయని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇదిలా ఉండగా అటల్ బిహారీ వాజ్‌పేయి అంటే పదవికి గౌరవం తెచ్చిన వ్యక్తి మాత్రమే కాదని, పదవికే గౌరవం నేర్పిన వ్యక్తి అని కొనియాడారు. వాజ్‌పేయి చాలా సాఫ్ట్ అని అనుకున్నారని, కానీ పోఖ్రాన్ అణు పరీక్షలు నిర్వహించి దేశం కోసం అవసరమైతే కఠిన నిర్ణయం ఎలా తీసుకోవాలో చేతల్లో చూపించారని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, గంట శ్రీనివాసరావు, ఏపీ అసెంబ్లీ బీజేపీ ఫ్లోర్ లీడర్ విష్ణువర్ధన్ రాజు, ప్రభుత్వ విప్ కన్నబాబు, వెలగపూడి రామకృష్ణబాబు తదితరులు హాజరయ్యారు.



## నూతన సర్పంచ్ బండ స్వరూప మహేందర్ గౌడ్ ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన నాగర్ గూడ, డాక్టర్ కాజా పాషా

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 20(ప్రజాస్వరం):**



రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని నాగర్ గూడ నూతన సర్పంచ్ బండ స్వరూప మహేందర్ గౌడ్ ను నాగర్ కూడా డాక్టర్ ఖాజా పాషా, శనివారం శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాజా బాషా మాట్లాడుతూ ఎల్లప్పుడూ పేద ప్రజల సేవ చేయడానికి ఏ పదవి లేకున్నప్పటికీ నాగర్ గూడ గ్రామంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులతో సంబంధాలు చాలా ఉన్నప్పటికీ నిధులు తెచ్చి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టిన తీరు ప్రజలు గ్రహించి నాగర్ కూడా గ్రామపంచాయతీ సర్పంచ్ పట్టం కట్టారని ఆయన కొనియాడారు. ప్రస్తుతం నూతన సర్పంచ్ గా గెలుపు పట్ల నాగర్ గూడ గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రెబల్స్ ను ఎందుకు కంట్రోల్ చేయలే..?

**మొదటిపేజీ తరువాయి**

కమ్యూనిస్టు పార్టీలు 1 శాతం సాధించాయి. 94 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగిన ఎన్నికల్లో 87లో కాంగ్రెస్ ఆధిక్యం సాధించింది. సమావేశంలో ఈ విజయాన్ని పార్టీ నేతలు సంతృప్తిగా గుర్తించినప్పటికీ, రెబల్స్ సమస్యపై తీవ్ర చర్చ జరిగింది. రెబల్స్‌ను సమన్వయం చేయలేకపోవడం, బంధువులను అభ్యర్థులుగా నిలబెట్టడం వల్ల పార్టీకి తీరని నష్టం జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సరిగ్గా పనిచేయని 16 నుంచి 18 మంది ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులపై అసహనం ప్రదర్శించారు. పార్టీ క్రమశిక్షణను కాపాడాలని, వైఖరి మార్చుకుని నియమ నిబంధనలకు లోబడి పనిచేయాలని నేతలకు ఆదేశాలు జారీ చేశారు. రెబల్స్ వల్ల కొన్ని చోట్ల అధికారిక అభ్యర్థులు ఓడిపోవడం పార్టీకి ఇబ్బందికరమని, ఇకపై ఇలాంటి లోపాలు ఉండకూడదని హెచ్చరికలు జారీ అయ్యాయి. ఈ సమీక్షలో అధిష్ఠానం రాష్ట్ర నేతల నుంచి వివరణాత్మక నివేదిక తీసుకుంది. రానున్న మండల్, జిల్లా పరిషత్ ఎన్నికలకు ఈ లోపాలను సరిదిద్ది మరింత బలోపేతం చేయాలని సూచనలు ఇచ్చింది. పంచాయతీ ఎన్నికలు పార్టీ లేకుండా (నాన్ పార్టీ బేసిస్) జరిగినప్పటికీ, కాంగ్రెస్ రెండేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన మద్దతుగా రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఈ ఫలితాలు 2028 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌కు బూస్ట్ ఇస్తాయని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే రెబల్స్ సమస్యను త్వరగా పరిష్కరించకపోతే భవిష్యత్తులో నష్టం జరగవచ్చని అంతర్గతంగా ఆందోళన వ్యక్తమ





## తెలంగాణలో ఒంటిరిగానే పోటీ చేస్తాం


**మొదటిపేజీ తరువాయి**

కె. చంద్రశేఖర రావు (కేసీఆర్) ఆరోగ్య పరిస్థితి గురించి అడిగారని రేవంత్ రెడ్డి ఆరోపించిన సందర్భంపై కిషన్ రెడ్డి ప్రశ్నించారు. "ప్రధాని మోదీ కేసీఆర్ ఆరోగ్యం గురించి అడిగితే తప్పేం ఉంది? గతంలో సోనియా గాంధీ ఆరోగ్య పరిస్థితి గురించి కూడా అడిగారు. ఇది సాధారణ మర్యాద" అని గుర్తుచేశారు. పసలేని ఆరోపణలు చేసే వారికి జవాబు చెప్పాల్సిన అవసరం లేదని, అలాంటి వాళ్ల మాటలకు విలువ లేదని కిషన్ రెడ్డి అన్నారు. రాజకీయ విమర్శలు మాని, ప్రజలకు మేలు చేసే పనులు చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి హితవు పలికారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను విలీనం చేసిన నిర్ణయంపై కూడా కిషన్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "వ్యక్తిగత ఆదాయం కోసమే ఈ విలీనాలు చేశారు. మొదటి నుంచి బీజేపీ దీనికి అభ్యంతరం తెలిపింది" అని విమర్శించారు.
గ్రామీణాభివృద్ధి అంశంపైనా కిషన్ రెడ్డి రేవంత్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేశారు. "గ్రామాల్లో గెలిచిన సర్పంచ్‌లను డబ్బు ఆశ చూపి, ఇతర ఒత్తిళ్లతో కాంగ్రెస్ పార్టీలోకి రమ్మని బలవంతం చేస్తున్నారు" అంటూ మండిపడ్డారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఏం చేయడం లేదని, గ్రామాల్లో ప్రతి అభివృద్ధి పనికి కేంద్ర నిధులే ప్రధానమని స్పష్టం చేశారు. "బీజేపీ తరపున గెలిచిన సర్పంచ్‌లకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధుల గురించి, వాటి ఉపయోగం గురించి పూర్తి అవగాహన ఉంది. అందుకే వాళ్లు బీజేపీలోనే ఉంటున్నారు" అని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ ఇంటర్వ్యూ ద్వారా కిషన్ రెడ్డి... రేవంత్ రెడ్డి చేసిన బీజేపీబీఆర్ఎస్ పొత్తు ఆరోపణలను పూర్తిగా తిప్పికొట్టడమే కాక, కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనపై కూడా తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ రాజకీయాల్లో మరోసారి బీజేపీకాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం ముదిరినట్లు కనిపిస్తోంది.

## జాతిపితను అవమానిస్తారా?

**మొదటిపేజీ తరువాయి**

ఈ ఆందోళన నిర్వహించారు. ఈ నిరసనలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు శ్రీధర్ బాబు, మహ్మద్ అజారుద్దీన్, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ ), వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, వీహెచ్ (వి. హనుమంత్ రావు) తదితరులు పాల్గొన్నారు.
కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా మహాత్మా గాంధీ పేరును పథకం నుంచి తొలగించడం జాతిపితను అవమానించడమేనని, గ్రామీణ పేదలకు జీవనోపాధి కల్పించే ఈ ప్రతిష్టాత్మక పథకాన్ని బలహీనపరచడానికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ప్రపంచంలోనే అతిపెద్ద ఉపాధి హామీ కార్యక్రమమని, దీని స్ఫూర్తిని, హక్కును దెబ్బతీసేందుకే పేరు మార్పు, నిధుల కేటాయింపులో మార్పులు చేస్తున్నారని విమర్శించారు.
టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, "కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు బీజేపీ కుట్రపన్నుతోంది. గాంధీజీ పేరు తొలగించడం ఆర్ఎస్ఎస్‌బీజేపీల కుటిల ఆలోచనకు నిదర్శనం" అని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా బీజేపీ కార్యాలయాల ముట్టడి, ధర్నాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇతర నేతలు కూడా కేంద్రం గ్రామీణ పేదల హక్కులపై దాడి చేస్తోందని, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ ఆదర్శాలను కాపాడేందుకు కాంగ్రెస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ పథకం గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు 100 రోజుల ఉపాధి హామీ ఇస్తూ, వలసలను అరికట్టడం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదపడుతోంది. దీని పేరు మార్పుతో పాటు నిధుల వాటా 60:40కు మార్చడం రాష్ట్రాలపై భారం పెంచుతుందని కాంగ్రెస్ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఈ అంశంపై నిరసనలు చేపడుతోంది. పార్లమెంట్‌లో కూడా విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. తెలంగాణలోనూ ఈ నిరసనలు కొనసాగుతాయని నేతలు తెలిపారు.



## ప్రభుత్వం స్పందించకపోతే నిరాహార దీక్ష చేస్తా



**మొదటిపేజీ తరువాయి**

రాష్ట్ర కార్యాలయంలో శనివారం బోయిన్ పల్లి మనో వికాస్ నగర్ లోని నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఫర్ ఎంపవరమెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంట లెక్చువాల్ డిజబులిటీస్ (ఎన్ఐఈపీఐడీ) లో శిక్షణ పొందుతున్న ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు వారి తల్లితండ్రులతో సమావేశమయ్యారు. ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ మానసిక పరిపక్వత తక్కువగా ఉన్న పిల్లలకు ఏ ప్రభుత్వం వచ్చిన కూడా మేలు జరగలేదన్నారు. దేశంలో మానసిక ఎదుగుదల తక్కువ గా ఉన్న వారిని దివ్యాంగుల్లో కలపలేదని, కానీ మేము పార్లమెంట్ లో పోరాటం చేస్తే 21 రకాల సమస్యలు ఉన్న వారిని కూడా దివ్యాంగులుగా పరిగణించారన్నారు. తెలంగాణలో కూడా దివ్యాంగుల తల్లితండ్రులకు ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని నేనే పోరాటం చేసి జీవో వచ్చేలా చేశాను, కానీ దురదృష్టవశాత్తు ఆ జీవో మాత్రం సరిగా అమలు కాలేదన్నారు. మూడేళ్ల క్రితం నేను ఎన్ఐఈపీఐడీ గురించి విన్నాను... మానసిక ఎదుగుదల తక్కువ ఉన్నపిల్లల తల్లితండ్రుల బాధలు నాకు తెలుసు.. వారికి ఇళ్లు కూడా అద్దెకు దొరకవు.. అందుకే వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదే విధంగా వారికి పెన్షన్ కూడా ఇవ్వాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఈ సమస్య ఉన్న వారు లక్ష మంది వరకు ఉంటారని వారందరికీ పెన్షన్ ఇవ్వగలిగే పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందన్నారు. ప్రభుత్వం పెన్షన్ ఇవ్వలేదంటే వారికి మనసు లేదని అర్థం చేసుకోవాలని, ప్రతి ప్రభుత్వ పథకంలో మెంటల్లీ, ఫిజికల్లీ ఛాలెంజ్ గా ఉన్న పిల్లల పేరెంట్స్ కు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. భర్త చనిపోయిన మహిళలు, ఒంటరి మహిళలకు కూడా పెన్షన్ల విషయంలో ప్రాధాన్యం ఇవ్వాలని, ఇందుకు కోసం నా వంతుగా శక్తి వంచన లేకుండా పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. ముందుగా ప్రభుత్వానికి లేఖలు రాసి ఒక నెల సమయం ఇద్దాం...నెల రోజుల్లో స్పందించకపోతే మాత్రం కచ్చితంగా నేనే నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు.మీ తరపున నేను పోరాటం చేస్తాం. మీకు ఇబ్బంది లేకుండా చూడటం ప్రజా ప్రతినిధుల బాధ్యత..అదే విధంగా పిల్లలను అవమానించకుండా వారిని గౌరవించే మాదిరిగా ప్రభుత్వం పాలసీ రూపొందించాలి.. దివ్యాంగులు, మెంటల్లీ ఛాలెంజ్ పిల్లల కోసం ఎన్నో సంస్థలు పనిచేస్తున్నాయి.. అయితే వాళ్లు పొలిటికల్ గాను రిప్రంజెటేషన్ ఉండాలని కోరారు. అందుకే మేము జాగృతి లో డిసబులిటీ విభాగాన్ని కూడా పెట్టామని, ఈ విభాగం నిత్యం దివ్యాంగుల సమస్యల కోసం పోరాటం చేస్తూనే ఉంటుందని, స్పైనల్ డిసబులిటీ ఉన్న వాళ్లను కూడా పెన్షన్లలో ఇంక్లుడ్ చేయాలని ప్రభుత్వానికి ముందుగా ఒక నెల సమయం ఇద్దాం..తర్వాత పెన్షన్లు, ఇళ్లు ఇచ్చే వరకు మనం ప్రభుత్వం వెంటపడుదాం అని స్పష్టం చేశారు.

## టీ20 ప్రపంచకప్ కోసం భారత జట్టు ప్రకటన...

- **టీ20 ప్రపంచకప్, న్యూజిలాండ్ సిరీస్‌కు భారత జట్టు ప్రకటన**
- **కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్, వైస్ కెప్టెన్‌గా అక్షర్ పటేల్**
- **జట్టులోకి ఇషాన్ కిషన్, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్**
- **వికెట్ కీపర్ జితేశ్ శర్మకు కూడా దక్కని చోటు**

**ముంబాయి, (ప్రజాస్వరం):**

2026 టీ20 ప్రపంచకప్‌తో పాటు న్యూజిలాండ్‌తో జరగనున్న టీ20 సిరీస్ కోసం బీసీసీఐ జట్టును ప్రకటించింది. ఈ ఎంపికలో కీలకమైన పరిణామం చోటుచేసుకుంది. యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ కు వరల్డ్ కప్ టీమ్ లో చోటు దక్కలేదు. అతడిని వైస్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించడమే కాకుండా, ఏకంగా జట్టు నుంచే తొలగించారు. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్‌గా కొనసాగనుండగా, ఆల్ రౌండర్ అక్షర్ పటేల్‌ను కొత్త వైస్ కెప్టెన్‌గా నియమించారు. వికెట్ కీపర్ జితేశ్ శర్మ స్థానంలో మంచి ఫామ్‌లో ఉన్న ఇషాన్ కిషన్‌కు సెలక్టర్లు అవకాశం కల్పించారు. అదే విధంగా విధ్వంసకర బ్యాటర్ రింకూ సింగ్, ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్‌లకు కూడా జట్టులో చోటు దక్కింది. ఈ జట్టు ఎంపికలో ఇటీవలి ప్రదర్శనలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. గిల్ ఫామ్ కోల్పోవడం, మరోవైపు ఇషాన్ కిషన్ నిలకడగా రాణించడం వంటి అంశాలు ఈ మార్పులకు కారణమయ్యాయని విశ్లేషకులు చెబుతున్నారు.

**భారత జట్టు:**
సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, ఇషాన్ కిషన్, రింకూ సింగ్.



# పది రోజుల్లో అక్రిడిటేషన్ కార్డుల జీవో

- **వచ్చే ఏడాది ఇళ్ల స్థలాల కేటాయింపు పై తీపి కబురు**
- **టీడబ్ల్యూజేఎఫ్ మహాసభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటన**

**ముంబాయి, (ప్రజాస్వరం):**

జర్నలిస్టుల చిరకాల అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూ జె ఎఫ్)
జిల్లా మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉంది. అయితే అనివార్య కారణాల వల్ల అత్యవసరంగా హైదరాబాద్ వెళ్లాల్సి రావడంతో మంత్రి ఫోన్ ద్వారా జర్నలిస్టులను ఉద్దేశించి ప్రసంగించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకోబోయే కీలక నిర్ణయాలను ఈ సందర్భంగా వివరించారు.

**త్వరలో అక్రిడిటేషన్ కార్డులు**

రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదురుచూస్తున్న అక్రిడిటేషన్ కార్డుల ప్రక్రియ తుది దశకు చేరుకుందని మంత్రి పొంగులేటి తెలిపారు. రాబోయే పది రోజుల్లోనే దీనికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు జీవో విడుదల చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు.

**ఇళ్ల స్థలాలపై స్పష్టత**

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఇప్పటికే లోతుగా చర్చించామని మంత్రి పేర్కొన్నారు. గతంలో సుప్రీంకోర్టు ఉత్తర్వులు, న్యాయపరమైన చిక్కుల వల్ల కొంత ఆలస్యమైందని అయితే వాటన్నింటినీ అధిగమించి వచ్చే ఏడాది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం తరపున తీపి కబురు అందిస్తామని ప్రకటించారు. జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని కాపాడటం తమ ప్రభుత్వ బాధ్యతని ఆయన ఉద్ఘాటించారు.

**సమిష్టిగా ముందుకు సాగాలి**

టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభలు ఘనంగా నిర్వహించుకోవడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడుతున్న సంఘం నాయకులను, సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రతినిధులు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.



# గులాబీ బాస్ పునరాగమనం

**మొదటిపేజీ తరువాయి**

యాక్టివ్ అవుతున్నారు.
చాలా రోజుల తర్వాత కేసీఆర్ తెలంగాణ భవన్ (పార్టీ ప్రధాన కార్యాలయం)కు రానున్నారు. డిసెంబర్ 21 (ఆదివారం) మధ్యాహ్నం 2 గంటలకు కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ శాసనసభాపక్షం (బీఆర్ఎస్ఎల్పీ) మరియు రాష్ట్ర కార్యవర్గ సంయుక్త సమావేశం జరగనుంది. ముందుగా డిసెంబర్ 19కు నిర్ణయించిన ఈ సమావేశం పార్లమెంట్ సెషన్లు ముగియడంతో, పార్టీ ఎంపీలు కూడా పాల్గొనేందుకు వీలుగా 21వ తేదీకి వాయిదా వేశారు.
ఈ సమావేశంలో ప్రధానంగా కృష్ణా, గోదావరి నదీ జలాల వాటాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్యంపై చర్చ జరగనుంది. ఆంధ్రప్రదేశ్ నదుల అనుసంధానం పేరుతో జలదోపిడీకి కేంద్రం సహకరిస్తోందని, తెలంగాణకు చెందిన 8 మంది బీజేపీ ఎంపీలు మాత్రం మౌనంగా ఉన్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ముఖ్యంగా పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం (PRLIS)లో బీఆర్ఎస్ ప్రభుత్వం 91 టీఎంసీల నీటి కేటాయింపు సాధించగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 45 టీఎంసీలకే ఒప్పుకుని రాష్ట్ర రైతులను మోసం చేసిందనేది బీఆర్ఎస్ వాదన. ఈ నిర్లక్ష్యం వల్ల పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల రైతులకు తీరని నష్టం జరుగుతోందని పార్టీ నేతలు అంటున్నారు.
కేసీఆర్ ఈ సమావేశంలో తెలంగాణ సాగునీటి హక్కుల రక్షణకు మరో ప్రజా ఉద్యమానికి దిశా నిర్దేశం చేయనున్నారు. కాంగ్రెస్, బీజేపీలను తెలంగాణ ప్రజల ముందు దోషులుగా నిలబెట్టేందుకు పార్టీ వ్యూహం రూపొందించనుంది. సమావేశం అనంతరం కేసీఆర్ మీడియాతో మాట్లాడే అవకాశం ఉంది.
మరోవైపు పార్టీ సంస్థాగత పునర్వ్యవస్థీకరణ (ప్రక్షాళన)పైనా కేసీఆర్ దృష్టి పెట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ కొంతమేర పుంజుకున్న నేపథ్యంలో పార్టీని బలోపేతం చేసే ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కేసీఆర్ తెలంగాణ



భవన్‌కు రావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. గులాబీ శ్రేణులు ఇది పార్టీ పునరుజ్జీవనానికి శ్రీకారమని భావిస్తున్నాయి.
ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా కేసీఆర్‌ను కృష్ణాగోదావరి జలాల వివాదంపై బహిరంగ చర్చకు ఆహ్వానించారు. అసెంబ్లీలో ప్రత్యేక సమావేశం పెట్టి బీఆర్ఎస్ పాలనలో తెలంగాణకు జరిగిన అన్యాయాలపై ఆధారాలతో చర్చించడానికి సిద్ధమని రేవంత్ సవాల్ విసిరారు. రాజకీయంగా తెలంగాణలో నీటి వివాదం మళ్లీ హాట్ టాపిక్‌గా మారనుంది.

# వణికిస్తున్న చలి

**హైదరాబాద్ డిసెంబర్ 20(ప్రజాస్వరం)**



తెలంగాణలోని ప్రజలను చలి ఈ సీజన్‌లో తీవ్రంగా వణికిస్తోంది. ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే తక్కువగా పడిపోయాయి. అనేక జిల్లాల్లో సింగిల్ డిజిట్‌కు చేరుకున్నాయి. తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ డేటా ప్రకారం, హైదరాబాద్ నగరంలో అత్యల్పంగా 6.3 డిగ్రీల సెంటీగ్రేడ్, సంగారెడ్డిలో 4.5 డిగ్రీల సెంటీగ్రేడ్ నమోదయ్యాయి. ఇది ఈ సీజన్‌లో ఇప్పటివరకు అత్యంత అత్యల్పం. అత్యల్ప ఉష్ణోగ్రతలు డిసెంబర్ 11 నాటి చలిగాలులకు సమానంగా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి ఉష్ణోగ్రత దాదాపు 3.7 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. ఇది శనివారం ఉదయం చల్లగా ఉంటుందని సూచిస్తోంది. రాబోయే కొన్ని రోజుల పాటు కూడా ఇదే విధమైన శీతలగాలుల పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. డిసెంబర్ ప్రారంభం నుండి రాష్ట్రంలో శీతల గాలుల పరిస్థితులు నెలకొన్నాయి. ఉత్తర, పశ్చిమ తెలంగాణలో ఉష్ణోగ్రతలు 67 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోతాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. శీతల గాలుల పరిస్థితులు సాధారణ జనజీవనాన్ని ప్రభావితం చేస్తున్నాయి. దీనితో చాలా మంది ఉదయం, సాయంత్రం వేళల్లో ఇళ్లలోనే ఉంటున్నారు. చలి వాతావరణం పిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందని వైద్యులు వెల్లడించారు.

# రెండేళ్ల తర్వాత జిల్లా మంత్రిని నేనే

- **జిల్లా ఎస్పీ జాగ్రత్త**
- **మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు వార్నింగ్**
- **అందోలులో సర్పంచ్, వార్డు సభ్యుల అభినందన సభ**

**హైదరాబాద్ డిసెంబర్ 20(ప్రజాస్వరం)**




రెండేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తానే జిల్లా నుంచి మంత్రిగా ఉంటానని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు ప్రకటించారు. శనివారం అందోలులోని ఫంక్షన్ హాలులో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన బీఆర్ఎస్ సర్పంచ్‌లు, వార్డు సభ్యుల అభినందన సభను నిర్వహించారు. అందోలులో కార్యకర్తలను వేదిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ చెప్పాడని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లా ఎస్పీ జాగ్రత్త బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు వేదిస్తూ అక్రమ కేసులు బనాయిస్తే ఊరుకునేది లేదని, ఖబర్దార్ అంటూ హరీష్‌రావు హెచ్చరించారు. రెండేళ్లు ఓపిక పట్టండి మన ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందన్నారు. సింగూరు ప్రాజెక్టు రిపేరు చేసినట్లయితే యాసంగిలో క్రాప్ హాలిడే ప్రకటించి ఎకరాకు రూ.25వేలు పరిహారం చెల్లించాలని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు డిమాండ్ చేసారు. ఈ సభకు మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ అధ్యక్షత వహించగా, మాజీ మంత్రి హరీష్‌రావు ముఖ్య అతిథిగా హాజరైనారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో అందోలు నియోజకవర్గంలోని 40వేల ఎకరాలకు సేద్యానికి నీరు ఇచ్చామన్నారు. బీఆర్ఎస్ హాయాంలో సంగమేశ్వర, బసవేశ్వర ఇరిగేషన్ పథకం పనులను చేపట్టకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. జిల్లాకు సీఎం రేవెంత్‌రెడ్డి తీవ్ర అన్యాయం చేస్తున్నారని, జిల్లా అభివృద్ధికి నయా పైస మంజూరు కావడం లేదన్నారు. అధికారంలో లేకున్నా నియోజకవర్గంలో 75 సర్పంచ్ స్థానాలను గెలుచుకోవడం చాలా సంతోషకరమన్నారు. అధికారం లేకున్నా సర్పంచ్‌లు భయపడవద్దని, కేంద్రం మంజూరు చేసే 15వ ఆర్థిక సంఘం నిధులు నేరుగా సర్పంచ్‌ల ఖాతాలోకి వెళతాయని ఈ నిధులను ప్రధాని మోడీ, సీఎం రేవెంత్ రెడ్డిలు అడ్డుపడ్డా ఆగవని అన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలకు కూడా చెక్ పవర్ ఉండదని, రాష్ట్రపతికి, సర్పంచ్‌కు మాత్రమే చెక్ పవర్ ఉంటుందన్నారు. చక్కగా పనిచేయాలని, ఎన్నికల సమయంలో ఎలాగైతే ఓటర్లతో ప్రేమగా ఉన్నామో అలాగే ఉండాలన్నారు.

**దమ్ముంటే ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికలు పెట్టాలి**

సీఎం రేవెంత్‌రెడ్డికి దమ్ముంటే మున్సిపల్, ఎంపీటీసీ ఎన్నికలు జరిపించాలని, కారు గుర్తుతో ఎన్నికలు జరిపిస్తే ఒక్కసీటు కూడా కాంగ్రెస్‌కు రాదని హరీష్‌రావు అన్నారు. స్థానిక సంస్థలు పెట్టినా పెట్టకున్నా అసెంబ్లీ ఎన్నికల్లో చూసుకుందామని, కార్యకర్తలంతా ఐఖ్యమత్యంతో ఉండాలని సూచించారు. సర్పంచ్ ఎన్నికల్లో సీఎం ప్రచారంలో పాల్గొన్న సందర్భాలు చరిత్రలో లేవని, ఎన్నికల నిబంధనలను అతిక్రమించి ప్రతి జిల్లాలో పర్యటించారని అన్నారు.

# పామెన నరసింహులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలిగంటి మధుసూదన్ రెడ్డి

**రంగారెడ్డి, డిసెంబర్ 20(ప్రజాస్వరం):**

రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డిని శనివారం నగరంలోని ఆయన నివాసంలో పోతుగల్ నూతన సర్పంచ్ పామేనా నరసింహులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నూతన సర్పంచ్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలిగంటి మధుసూదన్ రెడ్డి, పోతుగల్ సర్పంచ్ మరియు పాలకవర్గాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ పోతుగల్ గ్రామాభివృద్ధికి తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని చైర్మన్ ఎలిగంటి మధుసూదన్ రెడ్డి సర్పంచ్ పాలకవర్గానికి హామీ ఇచ్చారు. పోతుగల్ దాని అనుబంధ చిన్న తండా పెద్దతండ గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చేపట్టాలని నూతన సర్పంచ్ పామెన నర్సింహులకు సూచించారు. ఈ సన్మాన కార్యక్రమంలో డబ్ల్యూ హెచ్ ఆర్ పి సి సి జాతీయ నాయకుడు డాక్టర్ జాకీర్ షరీఫ్, పార్టీ నాయకులు, భార్గవ రామ్, రాజు గౌడ్, శ్రీనివాసులు, పీరంపల్లియాదయ్య, రవి నాయక్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# బంగ్లాదేశ్‌లో హిందూ యువకుడి హత్య కేసు.. ఏడుగురు అరెస్ట్

**హైదరాబాద్ డిసెంబర్ 20(ప్రజాస్వరం):**

ఇటీవల బంగ్లాదేశ్ లో నెలకొన్న ఆందోళనల సందర్భంగా ఇస్లామ్ మతానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశాడన్న ఆరోపణలతో 25 ఏళ్ల దీపూ చంద్రదాస్ అనే హిందూ యువకుడిని ఆందోళనకారులు తీవ్రంగా కొట్టి చంపారు. ఈ హత్యపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తడంతో యూనస్ ప్రభుత్వం స్పందించింది. ఈ కేసులో ఇప్పటివరకు ఏడుగురిని అరెస్టు చేసినట్లు తెలిపింది. తమ ప్రభుత్వ పాలనలో మూక దాడులకు చోటు లేదని, ఈ కేసులో నిందితులకు కఠిన శిక్ష విధిస్తామని బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన కమిషన్ అల్లర్లపై దర్యాప్తు చేస్తోందని చెప్పారు. ప్రజలంతా సంయమనం పాటించాలని, మూక హింసకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. 'విద్యార్థుల ఉద్యమం'లో కీలకపాత్ర పోషించిన ఇంక్విలాబ్ మోంచో యువనేత షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్యకు గురికావడంతో.. అందుకు నిరసనగా ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో నివసిస్తున్న భారతీయులు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని ఆ దేశంలోని భారత హైకమిషన్ అక్కడి భారతీయులకు సూచించింది. కాగా బంగ్లాదేశ్ అల్లర్లలో మైనార్టీ వర్గానికి చెందిన దీపూ చంద్రదాస్ హత్యకు గురికావడం బాధాకరమని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ పేర్కొన్నారు.



# ప్రజల జీవితాలను కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉంది

- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**వికారాబాద్, డిసెంబర్ 20(ప్రజాస్వరం):**

ప్రజల జీవితాలను కాపాడాల్సిన బాధ్యత మన అందరిపైఉందనిజిల్లాకలెక్టర్ప్రతీక్‌జైన్‌తెలిపారు. శనివారం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రోడ్డు ప్రమాదాలు, రోడ్డు భద్రతలపై సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ... రోడ్డు భద్రత నియమాలు పాటించి, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అధికారులు బాధ్యత తో పాటు మానవతా దృక్పథంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. ఉద్యోగ బాధ్యతలలో సంతృప్తిని కలిగించే విధంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. అధికంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణకు సంబంధించిన పనులను చేపట్టాలని ఆయన తెలిపారు. జాతీయ రహదారులపై ఉన్నటువంటి గుంతలను పూడ్చి వేయాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. జాతీయ రహదారులకు గల అనుసంధాన రోడ్లను గుర్తించి స్పీడ్ బ్రేకర్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బి అధికారిని కలెక్టర్ ఆదేశించారు. మలుపులు ఉన్న రోడ్లను గుర్తించే విధంగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. జాతీయ రహదారుల జంక్షన్లలో సోలార్ వీధిలైట్ లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. పాఠశాల కళాశాలల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్గించాలని , ట్రాఫిక్ నిబంధనలు పాటించడం మనందరి బాధ్యత అని అప్పుడే ప్రమాధాలు జరగకుండా నివారించవచ్చని ఆయన తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్లకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేపట్టి వైద్య సేవలు అందించాలని డిపో మేనేజర్ కు కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులలో రక్తము నిలువలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఓ కు సూచించారు. మోతాదుకు మించి రవాణా చేపడుతున్న వాహనాలను గుర్తించి వాటిని సీజ్ చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారిని ఆదేశించారు. అక్రమంగా మైనింగ్ చేస్తున్న వాహనాలపై దృష్టి సారించాలని, అదేవిధంగా రవాణ, మైనింగ్ అధికారులు ఉమ్మడి తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, అదనపు ఎస్పీ బి.రాములు నాయక్, రవాణా అధికారి వెంకట్ రెడ్డి, ఆర్టిఏ మెంబర్ జాఫర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




# నూతన తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఏకగ్రీవం..

**మెదక్ డిసెంబర్ 20 (ప్రజాస్వరం)**

తపస్ మెదక్ జిల్లా కార్యనిర్వాహక వర్గ సమావేశంలో మెదక్ జిల్లా కేంద్రం సాయి బాలాజీ గార్డెన్స్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జిడ్డి ఎల్లం, జాల సిద్ధు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల కమిటీ పరిశీలకులు అంబరీష్, దేశ్ భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్, దుభాషి భాస్కర్ తెలియజేశారు. అనంతరం నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయ,విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు రామారావు, జిల్లా బాధ్యులు, జిల్లాలోని 21 మండలాల అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులు, తపస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలి

**రామాయంపేట. 20.( ప్రజాస్వరం)**



అడవి ప్రాంతంలో అగ్నిప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని మెదక్ ఫారెస్ట్ రేంజ్ సెక్షన్ ఆఫీసర్ అజిత్ సూచించారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అడవి ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. అగ్ని ప్రమాదాలు జరిగితే అడవిలో ఉన్న చెట్లు కాలిపోతాయని, వన్యప్రాణులకు ముప్పు ఏర్పడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యావరణానికి ముప్పు ఏర్పడితే మానవ మనుగడకు ఇబ్బందులు ఎదురవుతాయని సూచించారు. పర్వతాపూర్ అడవి ప్రాంతాన్ని ప్రభుత్వం ఏకో టూరిజం స్పాట్ గా ఎంపిక చేసిందని దీంతో త్వరలో కోట్ల రూపాయలతో అడవిలో అభివృద్ధి పనులు చేపడుతామని తెలిపారు. ఏకో టూరిజం అందుబాటులోకి వస్తే స్థానికులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. అడవి రక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, ఎఫ్ ఎస్ ఓ అజీజ్, బీట్ ఆఫీసర్ అర్జున్ చారి, సాయి కృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీశైలం, అడవి వాచెస్ తదితరులు పాల్గొన్నారు



## భీంగల్ లో మార్కెట్ తరలింపుతో కొత్త బస్టాండ్ కు కొత్త కళసౌకర్యాల కల్పనలో అఖిలపక్షాల ఆరాటం

**భీంగల్,డిసెంబర్20(ప్రజాస్వరం):**

భీంగల్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని చాలా కాలంగా నిరుపయోగంలో ఉన్న కొత్త బస్టాండ్ కు ఎట్టకేలకు మార్కెట్ తరలింపుతో మోక్షం కలిగింది.శుక్రవారం నుండి భీంగల్ కు వచ్చి పోయే బస్సులు అక్కడి నుండే ప్రయాణాలు చేయడంతో భీంగల్ అఖిలపక్ష నాయకులు, మున్సిపల్ అధికారులు,ఆర్టీసీ బస్టాండ్ ను ఉపయోగంలోకి తెచ్చారు.చాలా కాలంగా నిరుపయోగంగా ఉండడంతో చిత్తాచెదారం వేయడంతో ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతమంతా దుర్గంధ భరితమైంది. ప్రస్తుతం ప్రారంభం లోకి తెచ్చిన కొత్త బస్టాండ్ ఆవరణను క్లీన్ గా ఉంచి నీటి వసతులు, టాయిలెట్ వసతులు కల్పించినచో ఎటువంటి ఇబ్బందులు ప్రయాణికులు ఎదుర్కొనరు.రాత్రి వేళ కూడా లైటింగ్ సౌకర్యాలు మెరుగుపరిచి, బస్టాండ్ చుట్టూ ప్రహరీ గోడను పునర్నిర్మాణం చేపడితే బస్టాండుకు భద్రత ఉంటుంది. ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకొని కంట్రోలర్ ను అక్కడే ఉండేలా ఏర్పాటు చేసి,నైట్ వాచ్మెన్ ను కూడా నియమించవలసి ఉంది.మున్సిపల్ అధికారులు కూడా అక్కడ ఉన్న చెత్తను తొలగించి దుర్గంధం వాసన రాకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లి పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## భద్రాచలంలో భారీ పోలీసు తనిఖీలు:70 వాహనాలు స్వాధీనం

- **భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ పర్యవేక్షణలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్**

**బూర్గంపహాడ్,డిసెంబర్ 20(ప్రజాస్వరం):**

భద్రాద్రి కొత్తగూడెంజిల్లా:భద్రాచలం పట్టణం లోశాంతిభద్రతలను పరిరక్షించే లక్ష్యంతో,భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ పర్యవేక్షణలో శనివారం ఉదయం భద్రాచలంలో భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. సుమారు 100 మంది పోలీసు సిబ్బందితో రాజపేట కాలనీ మరియు జగదీష్ కాలనీలలో ఈ ఆపరేషన్ చేపట్టారు. ఈ దాడుల సందర్భంగా పోలీసులు సుమారు 300 ఇళ్లలో క్షుణ్ణంగా సోదాలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల వివరాలను సేకరించడంతో పాటు, స్థానిక నివాసితులకు భద్రతపై అవగాహన కల్పించారు. నేరాలను నియంత్రించడానికి మరియు సంఘవిద్రోహ శక్తుల కదలికలపై నిఘా ఉంచడానికి ఇటువంటి తనిఖీలు అవసరమని ఏఎస్పీ తెలిపారు. ఈ దాడుల సమయంలో, రాజపేట కాలనీలో పోలీసులు 80 లీటర్ల మద్యం మరియు సరైన పత్రాలు లేని పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాల్లో 65 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలు ఉన్నాయి. మొత్తం 70 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తమ వాహనాలను తిరిగి పొందడానికి యజమానులు అసలు పత్రాలను చూపించాలని వారు సూచించారు. కాలనీలలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు దాక్కొని ఉన్నా లేదా అనుమానాస్పదంగా కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ కోరారు.దాడులలో పట్టణ సీఐ,ఎస్ఐలు,ఏఎస్ఐలు, సీఆర్పీఎఫ్ ప్రత్యేక బృందం మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# 48వ వార్డు ప్రజలకు పది రోజులు ముందుగా నూతన సంవత్సర వెలుగులు తెచ్చిన గంకల

- **48వ వార్డులో నూతన హై మాస్ట్ వీధి దీపాలతో చీకటిని తరిమికొట్టిన గంకల కవిత అప్పారావు యాదవ్**
- **కొండ ప్రాంతంలో రింగ్ పోల్స్ ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న గంకల కవిత అప్పారావు యాదవ్ కృషి**
- **రింగ్ పోల్స్,హైమాస్ట్ దీపాల కొరకు పగలు రాత్రి తేడా లేకుండా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసిన గంకల కవిత అప్పారావు యాదవ్**
- **గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంతో సంతృప్తి చెందుతున్న 48వ వార్డు ప్రజలు**

**విశాఖపట్నం, డిసెంబర్ 20(ప్రజాస్వరం):**





జీవీఎంసీ 48వ వార్డు కొండవాలు ప్రాంతంలో రింగ్ పోల్స్ ఏర్పాటు చేయాలని 48వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ బిజెపి ఫ్లోర్ లీడర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ గంకల కవిత అప్పారావు యాదవ్ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమీషనర్,జీవీఎంసీ మేయర్,ఏపీఈపీడీసీఎల్ సీఎండి లకు పలుమార్లు వినతులు చేశారు. గంకల కవిత అప్పారావు యాదవ్ పిర్యాదుపై అధికారులు స్పందించి గతంలో రింగ్ పోల్స్ ఏర్పాటు చేసి హై మాస్ట్ వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. నూతన వీధి దీపాల హామీ మేరకు శనివారం వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఏడు రింగ్ పోల్స్ కు హైమాస్ట్ వీధి దీపాలను ఏర్పాటు చేశారు.పగలు, రాత్రి తేడా లేకుండా ఉదయం నుంచి కార్మికులతో కలిసి మధ్యాహ్నం భోజనం విరామం లేకుండా కార్మికులతో రాత్రి వరకు ఉండి వార్డులో నూతన వీధి దీపాలను ఏర్పాటు చేసి ప్రజలకు నూతన సంవత్సర వెలుగులను ముందుగానే అందించారు.ఈ సందర్భంగా గంకల కవిత అప్పారావు యాదవ్ మాట్లాడుతూ 48 వ వార్డు అంతా కొండ ప్రాంతం కావడంతో చీకటి ప్రదేశం నెలకొంటుందని,ఈ చీకటి ప్రదేశంలో ఆకతాయిల ఆగడాలు పెరుగుతున్నాయని, నిత్యం దొంగతనాలు జరుగుతున్నాయని పలుమార్లు కలెక్టర్, జీవీఎంసీ కమీషనర్,జీవీఎంసీ మేయర్,ఏపీఈపీడీసీఎల్ సీఎండి లకు వార్డులో నూతన రింగ్ పోల్స్ ఏర్పాటు చేయాలని వినతి అందజేయడం జరిగిందని, ఇదే విషయంపై జీవీఎంసీ కౌన్సిల్లో చర్చించడం జరిగిందన్నారు. గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో వార్డు ప్రజల సమస్యలు తెలుసుకుని వార్డులో రింగ్ పోల్స్ అవశ్యకత ఉందని ప్రజల ద్వారా తెలుసుకొని గత నాలుగు ఏళ్లగా పోరాటం చేశామని ఈ పోరాటానికి ఫలితం దక్కిందన్నారు.పలు మార్లు అందించిన వినతులపై జీవీఎంసీ కమిషనర్,మేయర్, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ అధికారులు స్పందించి వార్డులో ఏడు రింగ్ పోల్స్ కేటాయించడం జరిగిందని, వాటికి ఈరోజు నూతన హైమాస్టూ వీధి దీపాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వాటిని జవహర్ లాల్ నెహ్రూ నగర్, ఇందిరా నగర్ 2,ఇందిరా నగర్ 4,ఇందిరా నగర్ 5,జై భారత్ నగర్, పల్నాటి కాలనీ, బాపూజీ నగర్ లో ఒక్కొక్క పోల్ చొప్పున ఈరోజు ఏర్పాటు చేయడం జరిగిందని,వీటి ద్వారా వార్డు అంతట విద్యుత్ దీపాల వెలుగులను కురిపిస్తున్నామన్నారు. వార్డులో మరిన్ని వీధి దీపాలు, సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తామని గంకల హామీ ఇచ్చారు.48వ వార్డులో రింగ్ పోల్స్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం జరిగిందని గంకల కవిత అప్పారావు యాదవ్ పేర్కొన్నారు.నూతన రింగ్ పోల్స్, హై మాస్ట్ వీధి దీపాలు ఏర్పాటు పట్ల గంకల కవిత అప్పారావు యాదవ్ కృషి ఫలించిందని, వార్డులో గంకల కవిత అప్పారావు యాదవ్ కృషితో నూతన వెలుగులు వెలగడం పట్ల పలువురు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వార్డు ప్రజలకు ఎటువంటి సమస్య ఏర్పడిన తక్షణమే తనను సంప్రదించాలని గంకల కవిత అప్పారావు యాదవ్ సూచించారు.

## నిండు గర్భిణి ప్రాణాలు కాపాడిన యువశక్తి ఫౌండేషన్.

- **సమయానికి రక్తదానం చేసి మానవత్వం చాటిన రాము**

**వనపర్తి,డిసెంబర్ 20 (ప్రజాస్వరం):**

వనపర్తి జిల్లా పెబ్బేరు మండలానికి చెందిన జ్యోతి డెలివరీ కోసం శనివారం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. పరీక్షల అనంతరం ఆమెకు తీవ్ర రక్తహీనత ఉన్నట్లు గుర్తించిన వైద్యులు అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం ఎక్కించాలని సూచించారు. రక్తం అందుబాటులో లేకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు యువశక్తి ఫౌండేషన్‌ను సంప్రదించారు. సమాచారం అందుకున్న యువశక్తి ఫౌండేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నవీన్ గోబ్బుర్ వెంటనే స్పందించి ఫౌండేషన్ సభ్యుడు రాముకు తెలియజేశారు. మానవత్వంతో ముందుకొచ్చిన రాము సాటి మహిళ ప్రాణాలను దృష్టిలో పెట్టుకొని రక్తదానం చేయడంతో గర్భిణి ప్రాణాపాయం నుంచి బయటపడింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు యువశక్తి ఫౌండేషన్ సేవలను కొనియాడుతూ ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన యువత ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం - ప్రాణదానం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువశక్తి ఫౌండేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నవీన్ గోబ్బుర్,రక్తదాత రాము, ఫౌండేషన్ సభ్యులు అగ్రరాం శివ, సూగురు రాము,బల్మూరు మహేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.





## డబుల్ బెడ్‌రూమ్‌లలో ఎస్ఆర్కె స్టడీ హాల్ ప్రారంభం

- **విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి:పలుస శంకర్ గౌడ్**

**వనపర్తి,డిసెంబర్ 20 (ప్రజాస్వరం):**

జిల్లా కేంద్రంలోని చిట్యాల రోడ్‌లో డబుల్ బెడ్‌రూమ్‌లలో ఏర్పాటు చేసిన ఎస్ఆర్కె స్టడీ హాల్‌ను సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ శనివారం ప్రారంభించారు. ఈ స్టడీ హాల్‌ను గంధం బాల్‌రాజ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ, డబుల్ బెడ్‌రూమ్‌లలో నివసిస్తున్న విద్యార్థులు సాయంత్రం సమయాల్లో, సెలవు దినాల్లో స్టడీ హాల్‌ను సద్వినియోగం చేసుకుని విద్యలో అభివృద్ధి సాధించాలని కోరారు. సుమారు 650 కుటుంబాలు నివసిస్తున్న ఈ డబుల్ బెడ్‌రూమ్‌లలో విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి స్టడీ హాల్స్ ఏర్పాటు చేయడం ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో గంధం బాల్‌రాజు,మాజీ కౌన్సిలర్ లక్ష్మి, సీఐటీయూ నాయకుడు మంద రాజు,శిరీష,అభిద్,సమీర,రాధ, షబానా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.




# నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై ఉక్కుపాదం

- **ప్రత్యేక తనిఖీలు చేపట్టిన వనపర్తి ట్రాఫిక్ పోలీసులు**

**వనపర్తి,డిసెంబర్ 20(ప్రజాస్వరం):**

రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు నేరాలకు అడ్డుకట్ట వేసే దిశగా వనపర్తి జిల్లాలో ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఆదేశాల మేరకు శనివారం వనపర్తి ట్రాఫిక్ ఎస్సై సురేందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలను ఆపి తనిఖీ చేశారు. చట్టబద్ధమైన నంబర్ ప్లేట్లు లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో సుమారు 40 నంబర్ ప్లేట్లు లేని వాహనాలను గుర్తించి జరిమానాలు విధించినట్లు ట్రాఫిక్ ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నంబర్ ప్లేట్లు లేని వాహనాలు రోడ్డు ప్రమాదాలకు కారణమవడమే కాకుండా చైన్ స్నాచింగ్, దొంగతనాలు వంటి నేరాలకు వినియోగించే ప్రమాదం ఎక్కువగా ఉందన్నారు. అటువంటి నేరాలకు అడ్డుకట్ట వేయడం, ప్రజల భద్రతను కాపాడడమే ఈ ప్రత్యేక తనిఖీల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా పోలీసులు చేపడుతున్న కార్యక్రమాలకు పట్టణ ప్రజలంతా సహకరించాలని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. వాహనదారులు తప్పనిసరిగా చట్టబద్ధమైన నంబర్ ప్లేట్లు అమర్చుకుని వాహనాలు నడపాలని సూచించారు. ఈ ప్రత్యేక తనిఖీ కార్యక్రమంలో వనపర్తి ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.







## అభివృద్ధిపై అధికారులతో సమీక్ష

**బూర్గంపహాడ్,డిసెంబర్ 20 (ప్రజాస్వరం):**

పినపాక నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు నిర్వహించారు. శనివారం మండలంలో పర్యటించిన శాసనసభ్యులు పాయంవెంకటేశ్వర్లు పినపాక నియోజకవర్గంలోని రోడ్లు,బ్రిడ్జీలు మరియు అంగన్వాడీ భవనాల నిర్మాణానికి సంబంధించి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు సమావేశంలో పీఆర్ ఈఈ సత్యనారాయణ,ఏఈ చారీ,ఐటీడీఏ ఈఈ మదుకర్,ఏఈ ప్రసాద్ లు పాల్గొన్నారు.





# టిఆర్ఎస్(డి) పార్టీ జిహెచ్ఎంసి, ఎంపీటీసీ, జెడ్,పి టి,సిఎన్నికల్లో పోటీ చేస్తుంది

- **టిఆర్ఎస్( డి) పార్టీ అధ్యక్షులు నరాల సత్యనారాయణ**

**బూర్గంపహాడ్,డిసెంబర్ 20(ప్రజాస్వరం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:టిఆర్ఎస్ (డి ) పార్టీ రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలతో పాటు ఎంపీటీసీ,జడ్పిటిసి, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేస్తుంది కావున పార్టీ శ్రేణులు సిద్ధం కాగలరని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నరాల సత్యనారాయణ కోరారు డిసెంబర్ 28వ తారీఖున హైదరాబాదులోని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలో గల నేరేడ్మెట్ ప్రాంతంలో ఉన్న అంబేద్కర్ భవన్లో ఉదయం 10 గంటలనుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే రాష్ట్రస్థాయి విస్తృత సమావేశంలో కార్పొరేషన్ ఎన్నికల ప్రకటన చేయడం జరుగుతుందని రాష్ట్ర అధ్యక్షులు నరాల సత్యనారాయణ తెలియజేశారు.టిఆర్ఎస్ (డి) పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడిన తెలంగాణ పొలిటికల్ జేఏసీలో వివిధ రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ప్రజా సంఘాలు, తెలంగాణ ఉద్యమకారుల సంఘాలు చేరినాయి కాబట్టి జనవరిలో తెలంగాణ ఉద్యమకారులకో సం"ఇందిరాపార్కు వద్ద3000 మందితో జరిగే ధర్నాను విజయవంతం చేయవలసి ఉంటుంది. అదే విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని 4000 మందితో ధర్నా చేయవలసిన బాధ్యత ఉన్నది కావున టిఆర్ఎస్ (డి) ప్రధాన భూమిక పోషించాలని టిఆర్ఎస్ (డి) వ్యవస్థాపక అధ్యక్షులు, తెలంగాణ పొలిటికల్ జెఎసి చైర్మన్ నరాల సత్యనారాయణ తెలియజేశారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ (డి) జిల్లా ప్రధాన కార్యదర్శి తెల్లం రాణి, జిల్లా ఉపాధ్యక్షురాలు పాల సృజన పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించిన సర్పంచ్

- **సర్పంచ్ పాపిరెడ్డి**

**వలిగొండ,డిసెంబర్ 20(ప్రజాస్వరం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ గ్రామపంచాయతీ నూతన సర్పంచ్ గా గెలిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుంభం వెంకట్ పాపిరెడ్డి శనివారం భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డిని వారినివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి ఈనెల 22న సోమవారం జరిగే సర్పంచ్ పదవి ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి తప్పక హాజరు అవుతానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుంభం విద్యాసాగర్ రెడ్డి, కుంభం ఉపేందర్ రెడ్డి, కుంభం లక్ష్మారెడ్డి, కృష్ణారెడ్డి, పులగుర్ల జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# ఏసీబీ వలలో వనపర్తి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

- **యూరియా సరఫరా కోసం లంచం డిమాండ్ చేసిన వ్యవసాయ అధికారి**
- **రూ.10 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు**
- **వనపర్తి జిల్లా ఏఓ పుప్పాల ఆంజనేయులు గౌడ్ అరెస్ట్**
- **లంచం అడిగితే ఫిర్యాదు చేయాలని ప్రజలకు ఏసీబీ విజ్ఞప్తి**

**వనపర్తి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 20(ప్రజాస్వరం):**

జిల్లాలో ఓ అవినీతి అధికారి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. వనపర్తి జిల్లా వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న పుప్పాల ఆంజనేయులు గౌడ్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే, ఒక రైతుకు యూరియా బస్తాలు సరఫరా చేసేందుకు గాను ఆంజనేయులు గౌడ్ రూ.20,000 లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా ఇప్పటికే బాధితుడి నుంచి రూ.3,000 అడ్వాన్స్‌గా తీసుకున్నారు. మిగిలిన మొత్తంలో నుంచి రూ.10,000 నగదును తీసుకుంటున్న సమయంలో, ముందుగా సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు ఆయనను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు కీలక సూచన చేశారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం డిమాండ్ చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇందుకోసం టోల్ ఫ్రీ నెంబర్ 1064కు డయల్ చేయాలని తెలిపారు. వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ (Telangana ACB), ఎక్స్ (@TelanganaACB) వంటి సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. ఫిర్యాదుదారుల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని అధికారులు భరోసా ఇచ్చారు.



# బాలికల భవిష్యత్తుకు వెలుగు రేఖ ఎస్ఓ దుర్గం పవిత్ర

- **కౌటాల మండల కేంద్రంలో ఆదర్శంగా నిలుస్తున్న కేజీబీవీ**

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా డిసెంబర్ 20(ప్రజాస్వరం):**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం బాలికల విద్యలో నూతన దిశను చూపిస్తూ ముందుకు సాగుతోంది. ముఖ్యంగా ఈ విద్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న దుర్గం పవిత్ర సేవలు విద్యార్థినులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయ వర్గాల మన్ననలను పొందుతున్నాయి. గ్రామీణ, వెనుకబడిన కుటుంబాలకు చెందిన బాలికలకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందించే దిశగా ఎస్ఓ దుర్గం పవిత్ర కృషి ప్రశంసనీయం. బాలికలు కేవలం చదువులోనే కాకుండా జీవిత నైపుణ్యాలు, స్వీయ రక్షణ ఆరోగ్య అవగాహన, పరిశుభ్రత, సామాజిక బాధ్యత వంటి అంశాల్లోనూ ముందుకు రావాలని ఆమె ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.బాలికల విద్యే సమాజ భవిష్యత్తు ఆచరణలో చూపిస్తున్న ఎస్ఓ దుర్గం పవిత్ర బాలిక చదువుకుంటే ఒక కుటుంబమే కాదు ఒక సమాజమే మారుతుంది అనే భావనను ఆచరణలో చూపిస్తున్నారు దుర్గం పవిత్ర. విద్యార్థినులతో నిత్యం మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకొని, మానసిక ధైర్యం నింపడం, చదువుపై ఆసక్తి పెంచడం ఆమె ప్రత్యేకతగా నిలుస్తోంది. క్రమశిక్షణ, భద్రతకు ప్రాధాన్యం విద్యాలయంలో బాలికల భద్రత, క్రమశిక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ తల్లిదండ్రులకు నమ్మకం కలిగించే వాతావరణాన్ని ఎస్ఓ దుర్గం పవిత్ర రూపొందించారు.ప్రతిభకు ప్రోత్సాహం ఆత్మ విశ్వాసానికి బలం చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు,ప్రసంగ పోటీలు, చిత్రలేఖనం, వంటీ కార్యక్రమాల ద్వారా బాలికల ప్రతిభను వెలికితీయడంలో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు.మేము చేయగలము" అనే



ఆత్మవిశ్వాసం బాలికల్లో నాటుతున్నారు. తల్లి దండ్రులు,అభినందనలు ఎస్ఓ దుర్గం పవిత్ర సేవలపై తల్లిదండ్రులు, హర్షం వ్యక్తం చేస్తున్నారు. బాలికలను సురక్షితంగా,బాధ్యతతో తీర్చిదిద్దుతున్నారని, కౌటాల మండలానికి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం గర్వకారణంగా మారిందని పేర్కొంటున్నారు.బాలికల కలలకు బాటలు వేసే విద్యాలయం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నేడు బాలికల విద్యకు ఆదర్శంగా నిలుస్తోంది.ఈ ప్రయాణంలో ఎస్ఓ దుర్గం పవిత్ర సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# చెఱుకు రైతుల రవాణా ఇబ్బందులను పరిష్కరించండి

**మక్తల్ ప్రతినిధి,డిసెంబర్ 20 (ప్రజాస్వరం)**

మేము అనగా కృష్ణవేణి చెఱుకు రైతు సంఘం, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా కమిటీ తమరితో చేయు మనవి ఏమనగా ఆత్మకూర్ పోలీస్ సర్కిల్ పరిధిలో (అమరచింత, ఆత్మకూర్, మదనాపురం) గత నెల రోజులుగా పండించిన చెఱుకు పంట రవాణా వేగవంతంగా సాగుతున్న విషయం తమరికి తెలిసిందే. దాదాపు ఏడాది పాటు కష్టించి పండించిన పంటను పరిశ్రమకు తరలించడం జరుగుతోంది. అయితే ఈ తరలింపుకు సంబంధించి మన పోలీస్ వారి నుండి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటుండటం వల్ల రైతులకు తీరని నష్టం వాటిల్లుతోంది. ముఖ్యంగా ఆత్మకూర్ టౌన్ తో పాటు అమరచింతలో ఈ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చెఱుకు లోడ్ చేసుకుని వెడుతున్న ట్రాక్టర్లను అమరచింత పొలిమేరల్లో, ఆపై ఆత్మకూర్ టౌన్లో లో పోలీసులు గంటల తరబడిగా నిలిపివేస్తున్నారు. ముఖ్యంగా రైతుల ట్రాక్టర్లను దాదాపు 08 నుండి 10 గంటల పాటు పోలీసులు ఆపివేస్తుండటం వల్ల రైతు రూ.3వేలు అదనంగా నష్టపోతున్నారు. ఇలా నిలిపివేయడంతో రైతులకే గాక లేబర్కు, ట్రాన్స్పోర్టర్కు జరిగే నష్టంతో పాటు పరిశ్రమలో రికవరీ తగ్గి అక్కడ కూడా రైతు మద్దతు ధరను నష్టపోవడం జరుగుతోంది. ప్రధానంగా ఆత్మకూర్ టౌన్ కు బైపాస్ రోడ్డు లేకపోవడం వల్ల తప్పని పరిస్థితుల్లో టౌన్ నుండే రవాణా చేయక తప్పడం లేదు. కనుక ఆత్మకూర్ టౌన్లో ప్రధానంగా పోలీసు శాఖ పరంగా ఎదురవుతున్న నిలిపివేతలకు సంబంధించి మినహాయింపు ఇచ్చి రైతులకు నష్టం వాటిల్లకుండా సహాయపడాల్సిందిగా తమరికి విజ్ఞప్తి చేస్తున్నాము. ఈ మేరకు తమరి సిబ్బందికి ఆదేశాలు జారీ చేయాలని రైతుగా మేము కూడా సహకరిస్తామని తమరికి తెలుపు కుంటున్నాము. వినతిపత్ర కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు రాజన్న ఉపాధ్యక్షులు వాసారెడ్డి సంజీవరెడ్డి వెంకటేష్రెడ్డి సహాయ కార్యదర్శి నారాయణ కోశాధికారి చంద్రసేనారెడ్డి జోన్ కమిటీ సభ్యులు రంగారెడ్డి వెంకట్రెడ్డి రాజేందర్ గౌడ్ వెంకట్ రెడ్డి శివన్న బాల్రెడ్డి మణి వర్ధన్ ఆశన్న రైతులు పాల్గొన్నారు






# ఉపాధి బిల్లును ఉపసంహరించుకోవాలి

- **సిపిఎం డిమాండ్**

**వలిగొండ,డిసెంబర్ 20(ప్రజాస్వరం):**

కేంద్రంలో అధికారంలో వున్న బిజెపి ప్రభుత్వం మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన జి రామ్ జి ఉపాధి బిల్లు వ్యవసాయ కార్మికులకు, పేదలకు తీవ్రంగా నష్టం చేసేదని ఈ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో రాజీవ్ విగ్రహం వద్ద బిల్లు ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలియజేయడం జరిగింది.

ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన అంగ బలంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రద్దుచేసి ఆ స్థానంలో జి రాంజీ ఉపాధి బిల్లును తీసుకురావడం జరిగిందని ఇది దేశంలోని వ్యవసాయ కార్మికులకు,పేద రైతులకు తీవ్ర నష్టమని అన్నారు. పాత బిల్లుకు సంబంధించి మహాత్మా గాంధీ పేరు మాత్రమే మారుస్తున్నామని ఇది మెరుగైనటువంటి బిల్లు అని 100 రోజుల పని 125 రోజులు పెంచుతున్నామని ఎన్ డి ఏ పార్లమెంటులో వాదించడం దుర్మార్గమని అన్నారు. కోట్లాదిమంది గ్రామీణ వ్యవసాయ కార్మికులు ఇతర పేదలకు భరోసాగా ఉన్న 100 రోజులు పని కల్పించే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రద్దు చేయాలని ఆలోచన బిజెపి ప్రభుత్వం అనేక సంవత్సరాలుగా ప్రయత్నం చేస్తూ వచ్చిందని ఈ ఆలోచన తుది రూపం జి రామ్ జి బిల్లు ద్వారా ఈరోజు ఇచ్చిందని అన్నారు.. రానున్న కాలంలో గ్రామీణ పేదలు పనిని హక్కుగా పొందే అవకాశం ఉండదన్నారు. జి రాంజీ ఉపాధి బిల్లులో 60 శాతం కేంద్ర ప్రభుత్వం నిధులు 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని పేర్కొనటం ఉపాధి చట్టాన్ని నీరుగార్చటమే అన్నారు. ఇది కాంట్రాక్టర్లకు అనుకూలమైన నిర్ణయమన్నారు. 2004 లో సిపిఎం వామపక్ష పార్టీల సపోర్టుతో ఏర్పడిన యూపీఏ1 ప్రభుత్వంపై వత్తిడి చేసి గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సిపిఎం వామ పక్ష పార్టీలు తీసుకువచ్చాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పిఎన్ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు పార్టీ పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వేముల నాగరాజు, పట్టణ కమిటీ సభ్యులు వేముల లక్ష్మయ్య శీలం ఇందిర, నాయకులు మారబోయిన ముత్యాలు,కూచిమల్ల కిష్టయ్య, ఎడవెల్లి రాములు, వేముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం అన్న కుమారుడు ఎనుముల శివారెడ్డి కాంగ్రెస్ పార్టీ నూతన సర్పంచులకు ఘన సన్మానం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 20(ప్రజాస్వరం):**

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని ఆస్పల్లి గూడ, గ్రామంలో ఎలుగంటి రాఘవరెడ్డి నివాసంలో రాష్ట్ర ముఖ్యమంత్రి అన్న కుమారుడు, శివారెడ్డి, షాబాద్ మండలానికి చెందిన ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నూతన సర్పంచులను శుక్రవారం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన నూతన సర్పంచులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు పట్ల ప్రజలు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు సర్పంచులుగా గెలవడం తనకెంతో సంతోషంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ తరపున గెలుపొందిన నూతన సర్పంచులకు గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధుల కొరత రాకుండా చూసే బాధ్యత చేపడతానని దీంతో ఆయా గ్రామాలు అభివృద్ధి రంగాల్లో చేపట్టాలని ప్రజలు నమ్ముకున్న ఆశలు అడియాశలు చేయవద్దని ఆయన నూతన సర్పంచులకు సూచించారు. అదేవిధంగా నిధుల విడుదల విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తో చర్చించి గ్రామాల అభివృద్ధికి నిధులను విడుదల చేయిస్తానని శివారెడ్డి సర్పంచుల సన్మాన సభలో వెల్లడించారు. దీంతో సన్మానించిన నూతన సర్పంచులు శివారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో నూతన సర్పంచులు, పోతుగల్ నూతన సర్పంచ్ పామెన నరసింహులు, సీతారాంపూర్ నూతన సర్పంచ్ చెన్నయ్య, అంతారం సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, ఆస్పల్లి గూడా సర్పంచ్ శివ నీల, మరి కొంతమంది సర్పంచులు కూడా ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సన్మాన కార్యక్రమానికి షాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల సంతోష్ రెడ్డి, కే శ్రీనివాస్, షాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.



# శేరిగూడ గ్రామపంచాయతీ ఎన్నికల వివాదంపై మండల కార్యాలయం ఎదుట నిరసన.

- **ఎంపీడీవో వెంకయ్య గౌడ్ సస్పెన్షన్‌కు డిమాండ్.**
- **"న్యాయం జరిగే వరకు పోరాటం" అంటూ గ్రామ ప్రజల నినాదాలు.**

**శంకర్ పల్లి డిసెంబర్ 20(ప్రజాస్వరం):**

శంకర్ పల్లి మండల పరిధిలోని శేరిగూడ గ్రామంలో గత రెండు మూడు రోజులుగా కొనసాగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల వివాదంపై శనివారం గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో శంకర్ పల్లి మండల ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు దొరల పాలన వద్దు, ఎంపీడీవో వెంకయ్య గౌడ్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలి అంటూ నినాదాలు చేశారు. గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో అన్యాయాలు జరిగాయని, అధికారుల తీరు పక్షపాతంగా ఉందని ఆరోపించారు. ఎన్నికల పనుల నిమిత్తం వచ్చిన అనిత వద్ద సరైన ఉత్తర్వుల ప్రతులు లేవని, ఆర్డర్ కాపీ చూపలేదని గ్రామస్తులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. గ్రామ ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని నిరసనకారులు స్పష్టం చేశారు.



# బిర్యానీ పాత్రలో సంపూర్ణేశ్ బాబు

నేచురల్ స్టార్ నాని, 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ చిత్రం 'ది ప్యారడైజ్' నుంచి ఒక షాకింగ్ అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో 'బర్నింగ్ స్టార్' సంపూర్ణేష్ బాబును ఒక సరికొత్త ఊర మాస్ అవతారంలో శ్రీకాంత్ ఓదెల చూపించబోతున్నాడు. ఎప్పుడూ తనదైన కామెడీతో నవ్వించే సంపూర్ణేష్ బాబును దర్శకుడు శ్రీకాంత్ ఓదెల పూర్తిగా మార్చేశాడు. 'ది ప్యారడైజ్' చిత్రంలో సంపూ 'బిర్యానీ' అనే మాస్ పాత్రను పోషిస్తున్నారు. శుక్రవారం విడుదలైన ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పుడు ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పోస్టర్‌లో సంపూర్ణేష్ బాబు ఒంటి నిండా రక్తపు మరకలతో, భుజాన గొడ్డలి వేసుకుని, బీడీ తాగుతూ చాలా సీరియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన కళ్లలో కనిపిస్తున్న క్రూరత్వం చూస్తుంటే, ఇందులో ఆయన కేవలం కామెడీకి పరిమితం కాకుండా ఒక పవర్‌ఫుల్ పాత్ర చేస్తున్నట్లు అర్థమవుతోంది. ఈ చిత్రంలో హీరో నాని (జడల్) కి అత్యంత సన్నిహితుడైన స్నేహితుడిగా, ప్రాణమిచ్చే నమ్మకస్థుడిగా 'బిర్యానీ' పాత్ర ఉండబోతోంది. ఈ పాత్ర కోసం సంపూర్ణేష్ బాబు చాలా బరువు తగ్గి, తన బాడీ లాంగ్వేజ్‌ను కూడా పూర్తిగా మార్చుకున్నట్లు చిత్ర బృందం తెలిపింది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తన సినిమాల్లో పాత్రలను చాలా సహజంగా, గంభీరంగా చూపిస్తారు. 'దసరా'లో కమెడియన్లను కూడా సీరియస్ పాత్రల్లో చూపించినట్లుగానే, ఇప్పుడు సంపూలోని యాక్షన్ యాంగిల్‌ను బయటకు తీయబోతున్నారు. 'హైదరాబాద్ నేపథ్యంలో సాగే కథలో 'బిర్యానీ' లేకుండా ఉండదు' అంటూ ఈ పాత్రను ఇంట్రడ్యూస్ చేసిన తీరు వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో నానితో పాటు, మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. ఈ సినిమా 2026 మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా 8 భాషల్లో (తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్) గ్రాండ్‌గా విడుదల కానుంది.




# నెట్‌ఫ్లిక్స్‌లోకి వస్తోన్న ఆంధ్రా కింగ్ తాలూకా

రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'.. తెలుగు సినీ అభిమాని కథగా నవంబర్ 27న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఈ సినిమా విడుదలై నెల కూడా తిరక్కుండానే ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో డిసెంబర్ 25 నుంచి తెలుగు, హిందీ, తమిళ్, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రం స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. విషయాన్ని తెలుపుతూ నెట్‌ఫ్లిక్స్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. మహేశ్‌బాబు.పి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కన్నడ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో నటించాడు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. సూర్య(ఉపేంద్ర) పేరుమోసిన సూపర్‌స్టార్. అశేషమైన అభిమానుల అతని సొంతం. అయితే.. తనకు బ్యాడ్ పిరియడ్ నడుస్తూ ఉంటుంది. విడుదలైన సినిమాలన్నీ ఫ్లాపులవుతుంటాయి. ఈ క్రమంలో సూర్య వందవ చిత్రం షూటింగ్ మధ్యలోనే ఆగిపోతుంది. చిత్రాన్ని నిర్మించలేనని నిర్మాత చేతులెత్తేస్తాడు. ఓ మూడు కోట్లు ఉంటే సినిమా పూర్తవుతుంది. ఆ మూడు కోట్ల కోసం సూర్య ప్రయత్నాలు మొదలుపెడతాడు. ఈ క్రమంలో ఓ నిర్మాతను డబ్బు అడుగుతాడు. అతను తన కొడుకు హీరోగా పరిచయం అవుతున్న సినిమాలో తండ్రి పాత్ర వేస్తే డబ్బు సర్దుతానంటాడు. ఎన్ని ప్రయత్నాలు చేసినా డబ్బు సమకూరకపోవడంతో చివరికి ఆ నిర్మాత పెట్టిన షరతుకి ఓకే చెప్పాలనుకుంటాడు. తన నిర్ణయాన్ని ఆ నిర్మాతకు చెప్పేలోపే సూర్య అకౌంట్‌లో మూడు కోట్లు పడతాయి. ఆ డబ్బు ఎవరు వేశారో సూర్యకు అర్థం కాదు. రాజమండ్రి దగ్గర్లోని ఓ పల్లెటూరి కుర్రాడు ఆ మూడు కోట్లు వేశాడని తెలిసి సూర్య షాక్ అవుతాడు. అతను తన అభిమాని తెలుసుకున్న సూర్య.. అతన్ని కలవాలని బయలు దేరతాడు? మరి సూర్య అభిమానిని కలిశాడా? ఓ పల్లెటూరి కుర్రాడికి ఈ మూడు కోట్లు ఎలా వచ్చాయి? అసలు ఆ కుర్రాడెవరు? అతని కథేంటి? ఈ ప్రశ్నలకు సమాధానమే అసలు కథ.



# ధురంధర్‌పై సందీప్ రెడ్డి వంగా స్పెషల్ రివ్యూ!



బాలీవుడ్‌ను షేక్ చేస్తున్న సెన్సేషనల్ హిట్ చిత్రం "ధురంధర్". ఇప్పటికే రూ.500 కోట్లకి పైగా వసూళ్లు క్రాస్ చేసిన ఈ సినిమా, ప్రస్తుతం రూ.1000 కోట్ల దిశగా శరవేగంగా దూసుకువెళ్తుంది. ఈ చిత్రంపై సినీ పెద్దల నుంచి ఎందరో ప్రముఖులు ప్రశంసలు కురిపించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమాపై డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా ప్రశంసల జల్లు కురిపించారు.

ఈ సెన్సేషనల్ హిట్ సినిమాపై దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఎక్స్ వేదికగా స్పెషల్ రివ్యూ ఇచ్చారు. సినిమా అదిరిపోయిందని, ఈ చిత్రంలో కీ రోల్స్ ప్లే చేసిన రణ్‌వీర్ సింగ్, అక్షయ్ ఖన్నా వారి పాత్రల్లో జీవించారని, ఈ సినిమాకు అన్నీ టాప్‌లో కుదిరాయని, ఇంత అద్భుతమైన చిత్రాన్ని అందించినందుకు డైరెక్టర్ ఆదిత్య ధర్‌కి ధన్యవాదాలు అంటూ పోస్ట్ చేశారు.

**పోస్ట్‌కు రిప్లై ఇచ్చిన డైరెక్టర్..**

థాంక్యూ డియర్ సందీప్. 'ధురంధర్' సినిమాని ఎంతో నమ్మకంతో, నిజాయితీగా రూపొందించాం. మీ మాటలు ఆ ప్రయాణానికి ఒక నిశ్శబ్ద గుర్తింపును ఇచ్చాయి. మీ నుంచి ఈ ప్రశంసలు రావడం నాకు ఎంతో ప్రత్యేకం. సినిమా పట్ల మీకున్న అంకితభావాన్ని, ఎక్కడా రాజీ పడని మీ శైలిని నేను ఎప్పుడూ గౌరవిస్తాను. భారతీయ సినిమా నిజాయితీగా, మూలాలను మరవకుండా బలంగా ఉండేలా చేసే మీలాంటి గొంతుకలు ఉన్నందుకు నేను కృతజ్ఞుడిని. సినిమా ఎప్పుడూ ధైర్యవంతులనే గుర్తుంచుకుంటుంది, అందరినీ మెప్పించే వారిని కాదు" అంటూ డైరెక్టర్ ఆదిత్య ధర్ రిప్లై ఇచ్చారు. ఈ చిత్రం డిసెంబర్ 5న విడుదలైన ఇప్పటికే దేశవ్యాప్తంగా రూ.500 కోట్లకు పైగా వసూళ్లు సాధించి.. రూ.1000 కోట్ల మార్క్‌ను అందుకోవడానికి పరుగులు పెడుతుంది. ఈ సినిమాలో రణ్వీర్ సింగ్, అక్షయ్ ఖన్నా, ఆర్.మాధవన్, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్, సారా అర్జున్ తదితరులు నటించారు.


# అక్షయ్‌ను చూసి అసూయ పడట్లేదు

అక్షయ్ ఖన్నా విషయంలో తాను అసూయపడడం లేదని మాధవన్ అన్నారు. ఇటీవల విడుదలైన 'ధురంధర్'లో మాధవన్ పాత్రకు (R తగిన గుర్తింపు రాలేదని ఆయన కంటే అక్షయ్ ఖన్నాకే ఎక్కువ ప్రశంసలు వస్తున్నాయని నెట్టింట కొన్ని పోస్ట్‌లు దర్శనమిస్తున్నాయి. తాజాగా వాటి గురించి మాధవన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. తాను అక్షయ్ విషయంలో ఎంతో ఆనందంగా ఉన్నట్లు తెలిపారు. ''అక్షయ్ ప్రతిభావంతుడు. 'ధురంధర్'లో అద్భుతంగా నటించారు. ఆయనకు వస్తున్న ప్రశంసలకు పూర్తి అర్హుడు. ఆయన కెరీర్‌లో ఎన్నో వేల ఇంటర్వ్యూలు ఇచ్చారు. సినిమా కోసం ఎంతో కష్టపడతారు. మూవీ ప్రేక్షకుల ముందు కొచ్చిన తర్వాత ఇంట్లో కూర్చొని సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తారు. ఆయనతో పోలిస్తే నేను చాలా తక్కువ కష్టపడతాను. అక్షయ్ స్థాయి వేరు. ఆయన జయాపజయాలను సమానంగా తీసుకుంటారు. 'ధురంధర్' లాంటి గొప్ప సినిమాలో నేను భాగమైతే చాలనుకున్నాను. ఆ సినిమా చరిత్ర సృష్టిస్తోంది. అంత గొప్ప చిత్రంలో నేనూ భాగం కావడం ఆనందంగా ఉంది. అక్షయ్, దర్శకుడు ఆదిత్యధర్ ఇద్దరిదీ ఎంత ఎదిగినా ఒదిగి ఉండే మనస్తత్వం'' అని మాధవన్ తెలిపారు.

ఇప్పటికే ఈ సినిమాపై సినీ ప్రముఖులు ప్రశంసలు కురిపించిన సంగతి తెలిసిందే. తాజాగా దర్శకుడు సందీప్ వంగా దీనిపై పోస్ట్ పెట్టారు. ''ధురంధర్' అనే పేరు ఈ సినిమాకు సరిగ్గా సరిపోతుంది. ఎలాంటి గందరగోళం లేకుండా కథను తెరకెక్కించారు. సంగీతం, స్క్రీన్‌ప్లే అద్భుతంగా కుదిరాయి. రణ్‌వీర్ సింగ్, అక్షయ్ ఖన్నా వారి పాత్రలకు వందశాతం న్యాయం చేశారు'' అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. మరుగునపడిన త్యాగాలను కళ్లకు కట్టినట్లు చూపించారని దర్శకుడిపై ప్రశంసలు కురిపించారు. ఈ పోస్ట్‌పై ఆదిత్య స్పందిస్తూ.. ధన్యవాదాలు తెలిపారు.



# ఆనాటి ఘటనలు తలచుకుంటేనే భయమేస్తోంది



బాలీవుడ్‌తో పాటు సౌత్ చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి రాధికా ఆప్టే. సినీ రంగంలో తన ఇరవై ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా చేసిన సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. కెరీర్ ఆరంభంలో తాను ఎదుర్కొన్న వివక్ష అలాగే బాడీ షేమింగ్ గురించి ఆమె ఆవేదన వ్యక్తం చేస్తూ, ఆ రోజులు గుర్తుకు వస్తే ఇప్పటికీ తన గుండె ఆగిపోయినంత పని అవుతుందని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా 2000వ దశకం చివరలో ఆర్థిక ఇబ్బందుల వల్ల కొన్ని దక్షిణాది సినిమాల్లో నటించాల్సి వచ్చిందని, అప్పుడు షూటింగ్ సెట్స్‌పై ఉన్న పరిస్థితులు అత్యంత దారుణంగా ఉండేవని ఆమె పేర్కొన్నారు. ఒక చిన్న ఊరిలో జరిగిన షూటింగ్ సమయంలో సెట్ అంతా మగవారే ఉండేవారని, అక్కడ తన శరీరాకృతి గురించి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసేవారని రాధిక వెల్లడిరచారు. సెట్‌లో ఉన్నవాళ్లు నా బమ్స్ మరియు బ్రెస్ట్స్ దగ్గర ప్యాడిరగ్ పెంచమని అడిగేవారు. 'అమ్మా.. మోర్ ప్యాడిరగ్' అని పిలిచేవారు. ఆ మాటలు విన్నప్పుడు తనకు నవ్వాలో ఏడవాలో అర్థమయ్యేది కాదని రాధికా వాపోయింది. అప్పట్లో తనకు రక్షణగా మేనేజర్లు, ఏజెంట్లు ఎవరూ లేకపోవడంతో ఒంటరిగా ఆ మానసిక వేదనను అనుభవించానని, ఆ పరిస్థితులు తనను ఇప్పటికీ మానసిక గాయానికి గురిచేస్తాయని ఆవేదన చెందారు. హిందీ పరిశ్రమలో కూడా కొందరు ప్రభావవంతమైన వ్యక్తుల ప్రవర్తన నచ్చక తానంతట తానే పెద్ద ప్రాజెక్టుల నుంచి తప్పుకున్నానని, ఒకవేళ వారి పేర్లు బయటపెడితే ప్రపంచమంతా షాక్ అవుతుందని ఆమె తెలిపింది. పరిశ్రమలో ఉన్నత స్థాయిలో ఉన్న మహిళలు కూడా వ్యవస్థను మార్చడానికి ప్రయత్నించకపోవడం విచారకరమని అభిప్రాయపడిన రాధికా ఆప్టే, ప్రస్తుతం తన తాజా చిత్రం 'సాలీ మొహబ్బత్' జీ5లో స్ట్రీమ్ అవుతున్న సందర్భంగా ఈ విషయాలను పంచుకుంది.

# వెన్నులో వణుకు పుట్టించేలా ఈషా

**25న వస్తోన్న భారర్ థ్రిల్లర్**



త్రిగుణ్, హెబ్బాపటేల్ కీలక పాత్రల్లో రానున్న హారర్ థ్రిల్లర్ 'ఈషా'. శ్రీనివాస్ మన్నె దర్శకుడు. ఆ హారర్ థ్రిల్లర్ డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో విడుదలకు మందు ఆసక్తికరమైన వీడియోను టీమ్ పంచుకుంది. ఆత్మ అంటే అదేనేమో అంటూ హీరోయిన్ చెప్పే డైలాగు భయపెట్టేలా ఉంది. ఇటీవల 'లిటిల్ హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' వంటి వరుస కల్ట్ హిట్స్ అందించిన సక్సెస్‌ఫుల్ జోడీ బన్నీ వాస్, వంశీ నందిపాటి. కలిసి ఇప్పుడు ప్రేక్షకులకు ఒక క్రేజీ హారర్ అనుభూతిని పంచడానికి సిద్ధమయ్యారు. వీరి సరికొత్త హారర్ థ్రిల్లర్ 'ఈషా' డిసెంబర్ 25న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ చిత్రం గురించి మేకర్స్ తాజాగా 'వార్నింగ్ వీడియో' పేరిట ఒక ఆసక్తికరమైన వీడియోను విడుదల చేశారు. సాధారణంగా హారర్ సినిమాలకు ట్రైలర్లు రావడం సహజం, కానీ ఇలా ప్రత్యేకంగా హెచ్చరిక వీడియో రావడం హారర్ జానర్‌లోనే ఇదే తొలిసారి. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఆత్మలు, దెయ్యాలు లేవని బలంగా నమ్మే కొందరు స్నేహితుల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. సమాజంలోని మూఢనమ్మకాలను, దొంగ బాబాలను ఎండగట్టాలని వారు భావిస్తారు. ఈ క్రమంలో వారికి పృథ్వీరాజ్ (బబ్లూ) నుంచి ఒక సవాలు ఎదురవుతుంది. 'ఆత్మలు ఉన్నాయని నిరూపిస్తే..?' అంటూ ఆయన విసిరే ఛాలెంజ్‌తో ఈ స్నేహితుల బృందం ఒక చీకటి ప్రపంచంలోకి అడుగుపెడుతుంది. మనుషుల్లాగే కొన్ని స్థలాలు కూడా పుట్టుకతోనే శాపగ్రస్తమై ఉంటాయి.. కాలక్రమేణా అవి ఆత్మలకు నిలయాలుగా మారుతాయని దర్శకుడు శ్రీనివాస్ మన్నె ఇచ్చిన వార్నింగ్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతోంది. ట్రైలర్ మరియు ఈ వార్నింగ్ వీడియోలో కనిపించిన విజువల్స్ భయానకంగా ఉన్నాయి. ముఖ్యంగా పాడుబడిన బంగ్లా, క్షుద్ర పూజల సెటప్, బ్లూ అండ్ డార్క్ థీమ్ విజువల్స్ వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి.సంతోష్ లైటింగ్, ధృవన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సినిమాలోని భయాన్ని రెట్టింపు చేస్తున్నాయి. ఈ చిత్రంలో ఉండే సడన్ ట్విస్ట్‌లు చూసి భయపడే అవకాశం ఉన్నందున, గుండె బలహీనంగా ఉన్నవారు ఈ సినిమా చూడకూడదని చిత్ర బృందం స్పష్టం చేసింది. ఇందులో త్రిగుణ్, అఖిల్ రాజ్ హీరోలుగా నటించగా, హెబ్బా పటేల్ హీరోయిన్‌గా నటించింది. సిరి హనుమంతు, బబ్లూ, పృథ్వీరాజ్ ఇతర కీలక పాత్రలు పోషించారు. డిసెంబర్ 25న విడుదల కానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రకంపనలు సృష్టిస్తుందో చూడాలి.

# సామాజిక సందేశంతో వస్తోన్న దండోరా




గ్రామీణ నేపథ్యంలో సాగే సందేశాత్మక చిత్రాలకు తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ బ్రహ్మరథం పడతారన్న విషయం తెలిసిందే. తాజాగా అదే కోవలో తెలంగాణ సంస్కృతి, సామాజిక అంశాల కలబోతగా వస్తున్న చిత్రం 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వంలో రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నైజాం ఏరియాలో విడుదల చేస్తుండటం సినిమాపై మరింత అంచనాలను పెంచింది. విదేశాల్లో కూడా ఈ సినిమా భారీ ఎత్తున విడుదల కానుంది. సుమారు 200కు పైగా థియేటర్లలో ప్రదర్శితం కాబోతున్న ఈ చిత్రానికి సంబంధించి, ఈ నెల 23నే అక్కడ ప్రీమియర్స్ పడనున్నాయి. అయితే ఈ సినిమా విడుదలకు ఇంకా వారం కూడా లేకపోవడంతో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. గ్రామాల్లో ఇంకా కులం అడ్డుగోడలు తొలగిపోలేదని ఈ ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతుంది. ప్రారంభంలోనే ఊరి బయట శవాన్ని మోసుకెళ్తున్న దృశ్యాలు, 'మన చావు పుట్టుకలన్నీ ఈ ఊరి బయట రాసింద్రా ఆ దేవుడు..' అనే డైలాగ్ ఈ సినిమాలో ఉన్న సామాజిక కోణాన్ని ఎత్తి చూపుతోంది. ఈ చిత్రంలో శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మానికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందుమాధవి, రాధ్య, అదితి భావరాజు వంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషించారు. మార్క్ కె. రాబిన్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. తెలంగాణ మట్టి వాసనతో కూడిన కథలను ఇష్టపడే వారికి 'దండోరా' ఒక మంచి అనుభూతిని ఇస్తుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999